# లేత సొరకాయ్! పదునుకత్తి

'లేత సొరకాయ్, పదునుకత్తి' అంటే ఏమిటో చాలామందికి తెలీకపోవచ్చు. ఈ ఉపమానం ఎందుకొచ్చిందో ఎలా వచ్చిందో కానీ 'అవలీలగా అబద్ధాన్ని చెబుతున్నాడూ' అని అనిపించినప్పుడు 'ఏయ్ కొయ్యకు' అనో 'చాల్లేవోయ్ లేత సొరకాయ్, పదునుకత్తి' అని ఎగతాళిగా అనడం జరుగుతుంది. కానీ ఆలోచిస్తే దీనిలో అర్థం లేకపోలేదు. అతి సులభంగా అతి తేలిగ్గా అప్రయత్నంగా అవలీలగా అలవాటుగా చెప్పే అబద్ధాన్ని లేత సొరకాయతోనూ, అబద్ధం చెబుతున్న వ్యక్తి నేర్పరితనాన్ని పదును కత్తితోను పోల్చారన్న మాట. లేత సొరకాయ మొండి కత్తితో కోసినా తెగుతుంది అటువంటిది పదునుకత్తితో కోస్తే క్షణం కూడా పట్టదన్న మాట!

నా చిన్నతనంలో ఒకసారి మేమందరం కలిసి ఆడుకుంటున్న సమయంలో మాతో ఆడుతూన్న రాజేశ్వరిని వాళ్లమ్మ పిలిచింది. అప్పుడే వాళ్ల తాతయ్య దొడ్లో వున్న చెట్టు మీంచి జామకాయలు కోశారని, అవి అందరూ తలా ఒకటి తీసుకుని వెళ్లమని. ఒక్క పరుగులో అందరం అక్కడికి చేరుకున్నాం. ఒక్కొక్క జామకాయ చాలా పెద్దదిగా ఇంచుమించు దబ్బకాయంత ఉంది. సంతోషంగా ఆశ్చర్యంగా తలో జామపండూ తీసుకున్నాం. మాలో వున్న కిట్టూ అందరం ఆ జామపండ్లని పొగడ్డం చూసి "ఇదేం పెద్ద పండుకాదు. మా బెజవాడలోనే ఒక్కొక్కటి అంత కాయ కాస్తుంది మా చెట్టుకి" అంటూ గుమ్మడికాయ సైజు చూపించాడు.

"ఏయ్ లేత సొరకాయ్, పదునుకత్తి" అన్నాడు వాళ్ల చిన్నతమ్ముడు కిట్టూని చూసి.

వాడు చెప్పిన విధానం ఎలా వుందంటే ఆ కాయ వాడు కోసేసి ముక్కలు చేసి నోట్లో వేసినంత కమ్మగా వుంది. అది నిజమేనేమోనన్న భ్రమ మా అందరిలోనూ కలిగించింది. అది మొదలు కొన్నాళ్లవరకు, కొన్నేళ్లవరకు

ఎవరింట్లో జామచెట్టు చూసినా 'గుమ్మడి కాయంత సైజులో జామకాయలు ఎక్కడైనా వుంటాయా? మీరు చూశారా' అని అడిగేదాన్ని. వాళ్లు నవ్వి అతిశయోక్తికి కూడా హద్దుంది అనేవారు. అప్పటిగ్గానీ తెలీలేదు. కిట్టు చెప్పినది శుద్ధ అబద్ధమని! ఇలా ఆలోచించకుండా అవలీలగా అబద్ధాలు చెప్పేవారిని చూస్తే భయమేస్తుంది. ఒక్కోసారి ఈ అబద్ధాలు ప్రాణసంకటాలుగా తయారవుతాయి.

సురేందర్ ఎప్పుడూ ఇంటికి ఆలస్యంగా వెళ్లేవాడు పేకాట ఆడి క్లబ్బులో. భార్యతో ఆఫీసులో పనుండి లేటుగా వస్తున్నానని కట్టు కథలు చెప్పేవాడు. కొన్నాళ్లు పాపం 'కాబోసు'ననుకుంది అతని భార్యామణి! కానీ ఒకరోజు అతని పాపం బద్దలై బాకీపడ్డ సుబ్బరాజు డబ్బుకోసం ఇంటికొచ్చేసరికి 'నిజం' కుండ బద్దలయినట్టు బద్దలైంది. దాంతో ఆ ఇల్లు చిన్న 'వియత్నాం వీడు'గా అయిపోయింది. ఏ విషయంలోనూ ఆరోజునుంచి సురేందర్ మాట నమ్మేది కాదు అతని భార్యామణి. ఒక్కోసారి నిజంగా ఆఫీసులో పనుండి లేటుగా వచ్చినా ఆ రోజు యుద్ధం తప్పేది కాదు సురేందర్‌కి ఇంట్లో. అంతేకాదు! భర్త ఏం చెప్పినా అది నిజమో అబద్ధమో తెలీక సీరియస్‌గా తీసుకునేది కాదు. తొందరగా నమ్మేది కాదు ఆవిడ!

మా రామరాజు పెళ్లాం వసుమతి రామరాజు ఆఫీసుకెళ్లి పోగానే డబ్బులు చేతిలో వుంటే సరేసరి, లేకపోతే ఒక కిలో బియ్యమో, పప్పో ఏదో ఒకటి అమ్మేసి ఆ డబ్బులతో మార్నింగ్ షోకో, మాట్నీకో వెళ్లొచ్చేసి గప్‌చుప్‌గా భర్త ఇంటికొచ్చేసరికి ఇంట్లో కూర్చునేది. ఒక్కోసారి ఇంట్లో సామాన్లు తొందరగా అయిపోయినట్టయి 'ఎందుకిలా?' అని అడిగితే మొన్న మీ అక్కయ్యా వాళ్లొచ్చి వెళ్లారు. అటుమొన్న మీ ఫ్రెండొచ్చాడు. నిన్న..." అంటూ లిస్టు ఏకరువు పెట్టేది. 'కాబోసు' అనుకుని ఊరుకునేవాడు రామరాజు. కానీ ఒకరోజు ఈమె దగ్గర సరుకులు కొనే పనిమనిషి వెంకటమ్మకీ, వసుమతికి దెబ్బలాట జరిగి వెంకటమ్మ కోపంతో అంతా ఏకరువు పెట్టేసింది. దానితో రామరాజు వసుమతి వీపు చిట్లకొట్టాడు. నాటినుంచి అతనిలో వసుమతి మీద అనుమానపు బీజం నాటుకుపోయి అవసరానికి ఆమె ఆసుపత్రికెళ్లినా, మార్కెట్టుకి వెళ్లినా

సినిమాకి వెళ్ళిందనే అనుకుని యక్షప్రశ్నలు వేసేవాడు.

సంసారంలో భార్యాభర్తలిలా ఒకరితో ఒకరు అవలీలగా అబద్ధాలు చెప్పుకుంటూ వుంటే ఒకరిమీద ఒకరికి ఏహ్యభావం, అపనమ్మకం చోటు చేసుకుంటాయి. ప్రేమా, అభిమానం, గౌరవం వుండవలసిన చోట్లో!

అలాగే స్నేహంలో కూడా!

స్నేహమనేది ఒక పవిత్ర బంధం అంటాడు మా గోపీ! స్నేహానికి ప్రాణం ఇస్తాడు. ఇద్దరు స్నేహితుల మధ్య ఆప్యాయత తప్ప స్వార్థం, జుగుప్స, ఈర్ష్య ఉండకూడదంటాడు. ఉంటే అది స్నేహమే కాదంటాడు.

ఒకసారి యోగి బొంబాయి కెళ్ళినప్పుడు ఒక మంచి టీషర్టు కొన్నాడు. అది చాలా బాగుందని తనకివ్వమని దాని డబ్బు తను ఇచ్చేస్తానని అన్నాడు గోపి. వెంటనే యోగి సరేనంటూ దాన్నిచ్చేసి దాని ఖరీదు వంద రూపాయలని చెప్పాడు.

గోపీ వెంటనే వందా యోగి చేతిలో పెట్టాడు. యోగి మురిసిపోయాడు. 'అరవై రూపాయలు' లాభం వచ్చినందుకు. ఆ తరువాత వారం రోజులకి గోపీ మేనల్లుడు కృష్ణ వచ్చాడు బొంబాయినుంచి. అచ్చం అదేరంగు, అదే టీషర్టు వేసుకున్నాడు. 'ఎంతరా ఇది! నేనూ కొన్నాను నా ఫ్రెండ్ యోగీ దగ్గర్నుంచి. వాడు ఊరికినే ఇస్తానంటే నేనే వద్దని డబ్బిచ్చేశా!" అన్నాడు.

"ఇది నలభై రూపాయలు మామయ్యా!" అన్నాడు కృష్ణ. గోపీ కళ్ళు తేలేశాడు. వెంటనే తన షర్టు తెచ్చి దాన్నీ దీన్నీ పక్క పక్కన పెట్టి చూశాడు. ఒకటే రంగు, ఒకటే బట్ట, ఒకటే ప్రైసు, ఒకటే కంపెనీ 'మేడ్'!

గోపీకి ఒళ్ళు మండిపోయింది "స్నేహంలోనూ అబద్ధమా? ఛీఛీ!" అన్నాడు గోపీ.

యోగి మొహం పాలిపోయింది. ఒక్క అబద్ధంతో అరవై రూపాయలు సంపాదించినా శాశ్వత స్నేహబంధం తెగిపోయింది.

అట్లాగే ఆఫీసుల్లో ఆఫీసరు అబద్ధాల కోరయితే కిందవాళ్లు చచ్చారన్న మాటే!

మా కోటేశ్వరరావు పనిచేసే ఆఫీసులో చిదంబరం అనే పై ఆఫీసరు ప్రతిదీ చెప్పి చెప్పలేదని, అనలేదని అనేవాడు. కోటేశ్వరరావుకి ప్రాణసంకటంగా వుండేది. చిదంబరం ఏదైనా పనిచెబితే చెయ్యాలో లేదో తెలిసేది కాదు. చేస్తే చేశాక 'ఎందుకలా చేశారు నేను చెప్పలేదే?' అనేవాడు.

"మీరే చెప్పారు సార్!" అంటే ఎందుకు చెప్పలేదో ఒక అరడజను అందమైన అబద్ధాల ఉదాహరణలు ఇచ్చేసేవాడు. దాంతో కోటేశ్వరరావే కాదు అందరూ భయపడేవాళ్లు అతను చెప్పిన పనేదైనా చెయ్యాలంటే! చిదంబరంగారి దగ్గర పని చెయ్యాలంటే! చిదంబరంగారి దగ్గర పని చెయ్యాలంటే అందరూ హడలి చచ్చేవాళ్లు. కానీ కొందరు 'తందాన తాన' వంత పాడేవాళ్లు మాత్రం అతనలా అన్నప్పుడు మనసులో తిట్టుకుంటున్నా పైకిమాత్రం 'అవును సార్! మీరే కరెక్ట్!' అనేవారు. వారు బాగుపడ్డారు అలా అనలేని కోటేశ్వరరావు చెడిపోయాడు.

అంత అవలీలగా అయినదానికీ, కానిదానికీ అబద్ధాలాడడం అందరికీ చేతకాదు! దానికి 'లేత సొరకాయ్ -- పదునుకత్తి' అవసరం.

సొరకాయ చూసినప్పుడల్లా ఈ సామెత తలుచుకోండి. అబద్ధం చెప్పలేరు ఏమంటారూ?!

*